


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

**రాబీ వెబ్‌స్టర్**

చలికాలపు రాత్రి. ఫ్లైట్ అరగంట లేట్ అని ఎనౌన్స్ చేశారు. జయదేవ్ ఓపిగ్గా కూర్చున్నాడు. అమెరికానించి వచ్చే రాబర్ట్ వెబ్‌స్టర్‌ని రిసీవ్ చేసుకోవాలి. రాబర్ట్ అన్న ఎడ్వర్డ్ వెబ్‌స్టర్, జయదేవ్ కలిసి చదువుకున్నారు. ఎడ్వర్డ్‌కి ఇండియా అంటే చాలా ఇష్టం. రాబర్ట్‌కి కొంచెం జాత్యహంకారం ఎక్కువ. ఇండియన్స్‌ని బ్రౌనీలంటాడు.

అతను ఇండియన్ కల్చర్ స్టడీకోసం ఇండియా వస్తున్నాడుట. నవ్వుకున్నాడు జయదేవ్. `రాబీ`కి ఇండియన్స్ అంటే చులకన. అటువంటివాడు ఇక్కడికి వచ్చి ఏం స్టడీ చేస్తాడు? `ఎడ్డీ` ఆ మాటే ఫోన్‌లో చెప్పి, "జయ్.. కొంచెం వాడ్ని గైడ్ చెయ్యి. సడన్‌గా ఇండియా అన్నాడు. అంతే చిత్రంగా ప్రయాణపు ఏర్పాట్లు పూర్తయిపోయాయి. ఎనీవే! మనిషికి కొంచెం తొందరపాటు ఎక్కువైనా తరవాత రియలైజ్ అయ్యేరకమే. కెన్ యూ హెల్ప్ హిమ్?" అని రిక్వెస్టు చేశాడు.

కాదని ఎలా అనటం.

ఫ్లైట్ ఎరైవల్ అన్న ముప్పై ఎనిమిది నిముషాల తరవాత `రాబీ` బయటికొచ్చాడు. మాంఛి రో బస్ట్ బాడీ.

"వెల్ కమ్ టూ అవర్ కంట్రీ" గ్రీట్ చేస్తూ చెయ్యి జాచాడు జయదేవ్.

"థేంక్యూ జయ్. కొంచెం కోల్డ్‌గా ఉంది కదూ" నవ్వాడు రాబీ.

కార్లో కూర్చున్నారు. మెల్లగా డ్రైవ్ చేస్తూ, "జర్నీ ఎలా ఉంది?" అడిగాడు జయదేవ్.

"ఫైన్. సెకండ్ హాఫ్ కాస్త బోర్ కొట్టింది" నవ్వాడు రాబర్ట్.

"అదేం?" "ఓ ఇండియన్ ఫిలాసఫర్ దొరికాడు. మీ టెంపుల్స్ గురించీ లెక్కలేని గాడ్స్ గురించీ, ఓహ్.. చాలా చాలా చెప్తూ నా బుర్ర తినేశాడు."

"నీ స్టడీకి అది ఉపయోగపడే సంభాషణేగా?" నవ్వాడు జయ్.

"యా.! ఆయన్ని అడిగింది నేనే. కానీ, ఆయన నేనడిగిన సందేహాలకి నవ్వి `మొదట బాగా వినండి. మాదేశాన్ని గమనించండి. ఆ తర్వాత సందేహాలడగండి` అన్నాడు. బట్ ఏదీ సైన్స్‌కి అందేదికాదు.

ఎవ్విరి థింగ్ యీజ్ బుల్ షిట్.." తలకొట్టుకున్నాడు రాబీ.

"రూం బుక్ అయిందా? రెండురోజులనించీ నిద్రలేదు" మళ్ళీ అన్నాడు.

"యా! గ్రౌండ్ స్పెన్సర్‌లో బుక్ చేశాను."

కారు హోటల్ ముందు ఆపాడు. రిసెప్షనిస్ట్ కీ యిచ్చింది. రూమ్ నంబర్ థర్టీన్ (అంతస్తు నంబర్ తొమ్మిది పక్కన పెడితే)

"ఓకె రాబ్. టేక్ రెస్ట్. రేపు ఉదయం కలుద్దాం. ఎనీ థింగ్ టూ ఈట్?"

"ఫ్లైట్ లో తినేశా. థాంక్స్" రూంలోకి ఎంటరవుతూ అన్నాడు రాబీ.

"గుడ్ నైట్" లిఫ్ట్‌లోకి వెళ్తూ అన్నాడు జయ్.

మరుసటి రోజు సాయంకాలం:

"మీవన్నీ మూఢాచారాలు. సైన్సు ముందర ఏవీ నిలబడవు. అదేంటయ్యా? దేవుడంటారు, సరే. ఓ శక్తిని మీరు దేవుడంటే మేం గాడ్ అంటాము. అంతమటుకూ ఓకే. ఎంతమంది దేవుళ్ళు? ముక్కోటి దేవతలా? షీర్ నాన్సెన్స్. ఒకడు ఎలిఫెంట్ గాడ్ ఇంకోడు మంకీ గాడ్ ఇంకొకడు హార్స్ హెడ్ గాడైతే మరొకడు లయన్ హెడ్ గాడ్ ఓ మైగాడ్ ఏమి జాతయ్యా మీదీ? స్టోన్ గాడ్స్, ట్రీ గాడ్స్ మై ఫుట్. అదికాక ప్రసాదాలూ నైవేద్యాలూ పూజలూ ఉపవాసాలూ వాటేన్ ఇడియసీ.." వెటకారం కలిసిన నవ్వుతో నొసలు చిట్లించాడు రాబర్ట్,

"మిస్టర్ రాబర్ట్! మీరు మాకు అతిధులు. మిమ్మల్ని గౌరవించడం మా విధి. అతిధి దేవోభవ` అని మా ధర్మం చెబుతుంది. అంటే అతిధి దేవుడితో సమానమని. ఆ విధంగా చూస్తే మీరూ మాకు దైవంతోనే సమానం. ఆ మాటనేమీ భాషలో చెప్పాలంటే ప్రస్తుతం మీరు మా  గెస్ట్ గాడ్ మీరు మాదేశాన్ని చూడ్డానికి వచ్చారు. ఎక్కడి సంప్రదాయాల్ని స్టడీ చెయ్యాలనుకున్నా, మొదట మీకు ఆ దేశం మీదా ఆ సంస్కృతి మీదా గౌరవం ఉండాలి. ఆ గౌరవం అనేది లేనప్పుడు మీరు స్టడీ చేసినా ఏమీ అర్థంకాదు. మీ ప్రశ్నలకు జవాబులు ఉన్నై. అయినా, వాటిని మీరే తర్కించి తెలుసుకోవడం మంచిది. మరో విషయం, మీరిక్కడికి వచ్చింది మా మతాన్నో ధర్మాన్నో కించపరచడానికైతే, ఐ యామ్ సారీ.. నేను ఏ విధంగానూ మీకు సహాయపడలేను" స్పష్టంగా చెప్పాడు జయదేవ్.

"సారీ జయదేవ్. తెల్లవాణ్ణి కదా, బహుశా జాతి అహంకారం అలా మాట్లాడించి వుంటుంది. ఇటువంటి పరిస్థితి రిపీట్ కాకుండా జాగ్రత్తపడతాను" కొంచెం బిడియపడుతూ అన్నాడు రాబర్ట్‌వెబ్‌స్టర్.

"మిమ్మల్ని బాధ పెట్టాలని నా ఉద్దేశ్యంకాదు. మీరు సారీ చెప్పాలని అంతకన్నా కాదు. మా ఆచారాలూ, మా జీవన విధానం మీకు కొత్త. మీది భౌతికవాదం. మాది ఆధ్యాత్మికం. నేనూ మీ దేశంలో ఓ దశాబ్దం పై చిలుకు ఉన్నాను. మీ దేశాన్నీ మీ జీవన విధానాన్నీ అధ్యయనం చేయటానికే ఆ సమయాన్ని వెచ్చించాను. నిజంగా మీ దేశంలో అంతకాలం గడిపాకే, నా దేశం మీద నాకు గౌరవం పెరిగింది. తిరిగి నా దేశం వచ్చి ఇక్కడి ధర్మాన్ని ఇంకా అర్థం చేసుకోగలుగుతున్నాను. మీ అన్నా నేనూ ఒకే యూనివర్సిటీలో చదివాం. ఆయన రిక్వెస్టు మీదే మీకు సహాయం చెయ్యడానికి ఒప్పుకున్నాను. మొదట మా దేశాన్ని చూడండి. పట్నాలూ, పల్లెలూ తిరగండి. మెల్లమెల్లగా అర్థం చేసుకోండి" రాబర్ట్ భుజం తట్టి అనునయంగా అన్నాడు జయదేవ్.

"థేంక్స్. మొదట ఎక్కడికి వెళ్ళమంటారు?"

"నా సలహా అయితే తిరుమల నించి"

"తిరుమల అంటే సెవెన్ హిల్స్ గాడ్ నించా?" నవ్వాడు రాబర్ట్.

"అవును. ద సెవెన్ స్టేజస్ ఆఫ్ లైఫ్ లాగా, సెవెన్ హిల్స్ నించే మొదలెడదాం. మరొకటి కూడా ఉంది. మెహర్ బాబాగారు చెప్పారు. సప్తజ్ఞాన భూమికలు ఉన్నై అని. ఆధ్యాత్మిక ఉన్నతికి ఏడుమెట్లు. అందుకే తిరుపతిని ఎన్నిక చేశా."

"రేపు బయలుదేరదామా?"

"నో. రేపు అష్టమి. అష్టమి రోజు బయలుదేరటం మంచిదికాదు"

"వై? అన్నిరోజులూ మంచివేగా?"

"అన్ని రోజులూ మంచివే. కాదనను. కానీ ప్రయాణానికి అష్టమి మంచిది కాదు"

"ఎలా?"

"డ్రైనేజ్‌లో ప్రవహించేదీ నీరే. సముద్రంలో ఉండేదీ నీరే. కానీ మంచినీటిని మాత్రమే తాగుతాం. అలాగే అన్నిరోజులూ రోజులే అయినా ప్రయాణాలకి మంచిరోజు చూసే బయలుదేరతాం"

"ఓ పని చేద్దాం. నేను రేపు బయలుదేరి వెళ్తాను. అలా వెడితే జరిగే నష్టం ఏమిటో చూస్తాను. మీరు ఎల్లుండి రండి. అయితే మీరు నా బసకి ఏర్పాటు చెయ్యాలి" సీరియస్‌గా అన్నాడు రాబర్ట్.

అతని వంక నిర్లిప్తంగా చూశాడు జయదేవ్. ఓ నిముషం తరువాత నవ్వి,

"గుడ్ దేన్నయినా పరీక్షించి తెలుసుకోవాలనే మీ తత్వం నాకు బాగా నచ్చింది. అలాగే మీకు ప్రయాణపు ఏర్పాట్లు చేస్తాను. బసకూడా"

"థేంక్స్" కరచాలనం చేశాడు రాబర్ట్,

"షల్ వియ్ హేవ్ డిన్నర్?" అడిగాడు జయదేవ్.

"ష్యూర్" ఇద్దరూ డిన్నర్‌కి లేచారు.

గ్రాండ్ స్పెన్సర్ హోటల్లో పదమూడవ నంబరు గది అది.

పదమూడో నంబర్ అమెరికన్స్‌కి అచ్చిరాదంటారు.

"విస్కీ?"

"యా!. ఆన్ రాక్స్"

ఓకె" బేరర్ వంక చూశాడు జయదేవ్.

"మీరూ?" అడిగాడు రాబర్ట్ (రాబీ)

"బ్రాందీ" నవ్వి, "నేను వారానికోసారి ఇక్కడికి వస్తాను. అతనికి తెలుసు. అందుకే విడిగా చెప్పలా" అన్నాడు జయదేవ్.

బేరర్ తొందరగానే తెచ్చిచ్చాడు.

"వచ్చేముందరే మీ ఇండియన్ రెస్టారెంట్స్‌లో కాస్త ఫుడ్ ట్రై చేశాను. స్పైసీ ఫుడ్ మొదట్లో గొంతు మండినా తరవాత కాస్త రుచి తెలిసింది"

"ఇక్కడ స్టేట్ స్టేట్‌కీ రుచులు మారుతూ వుంటై. మెక్సికన్ ఫుడ్ దొరకడం కొంచెం కష్టంకానీ, నగరాల్లో చైనీస్, థాయ్, ఇంటాలియన్ వంటకాలు దొరుకుతై. ఇక 'చీజ్' దొరికినా అక్కడ వుండే రకాలన్నీ ఇక్కడ దొరకవు. కాటేజ్ చీజ్

గ్యారంటీగా దొరుకుతుంది. పిజ్జాలు బర్గర్‌లూ కూడా ఓకె. ఎటొచ్చీ కాస్త ఘాటెక్కువ. మీ స్టార్‌బక్స్ కాఫీ కంటే ఇక్కడి సౌత్ ఇండియన్ ఫిల్టర్ కాఫీ టేస్ట్ ఎక్కువ. అయితే మీకు అలవాటు కావాలి. అంతే" నవ్వాడు జయదేవ్.

"ఇక్కడ కొంతమంది దగ్గర కొన్ని పురాతన గ్రంధాలు అంటే 'లీఫ్' వి ఉంటాయని ఓ ఇండియన్ ఫ్రెండ్ చెప్పాడు. అందులో ఏమనిషి గత జన్మ అయినా వ్రాసి ఉంటుందన్నాడు. నిజమేనా?" కుతూహలంగా అడిగాడు రాబ్.

"యా! వాటిని నాడీ గ్రంధాలంటారు. అగస్త్యర్ నాడీ గ్రంథం ఒకటి ఉంది. మిగతా వాటి పేర్లు గుర్తు లేదు. ఆ అగస్త్యర్ నాడీ గ్రంధం తాళ పత్ర గ్రంధం అంటే మీరన్నట్టు 'లీఫ్' వన్నమాట. ఆ భాష కొంచెం చిత్రంగా ఉంటుంది."

"నా గత జన్మ గురించి తెలుసుకునే వీలుందా?" కొంచెం ముందుకి వొంగి ఉత్సాహంగా అన్నాడు రాబ్.

"ష్యూర్ అయితే అందరూ ఖచ్చితంగా చెప్పగలరని నేను అనుకోను. ఖచ్చితంగా తెలియాలంటే మాత్రం ఒకరి దగ్గరికి వెళ్ళాలి. ఆయనకిప్పుడు తొంభై ఆరేళ్ళు"

"గాడ్ నైన్ టీ సిక్సా?" ఆశ్చర్యంగా అన్నాడు రాబీ.

"అవును. కానీ ఆయన ముందు కెళితే మనం సిగ్గుతో తలవంచుకోవాలి. అంత ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటారు"

"అయితే రేపు తిరుమల ట్రిప్ కేన్సిల్. ముందు ఆయన్ని చూద్దాం" ఆనందంగా అన్నాడు రాబ్.

"అదంత తేలిక్కాదు. ఆయన ఎక్కడ ఎప్పుడు ఎందుకు ఉంటాడో ఎవరికీ తెలీదు. మీ లక్ మీద ఆధారపడి ఉంది అంతా. ఎనీవే. ఆయన ఆచూకీ తెలియాలన్నా తిరుపతి వెళ్ళక తప్పదు. అక్కడ ఆయన శిష్యుడు ఒకాయన వున్నాడు. ఆయన్ని అడిగితే ఆచూకీ దొరకొచ్చు."

"ఓకె. తిరుపతి ట్రిప్ నో కేన్సిల్" పకపకా నవ్వి విస్కీ సిప్ చేశాడు రాబీ.

"పునర్జన్మల మీద మీకు అంత నమ్మకం ఉందా?" అడిగాడు జయదేవ్.

"ఉంది. లేదు. ఖచ్చితంగా చెప్పలేను. కానీ, కుతూహలం మాత్రం వుంది. కొంత లిటరేచర్ చదివాను కూడా" సాలోచనగా అన్నాడు రాబీ.

"లైఫ్ ఆఫ్టర్ డెత్ గురించిన పుస్తకాలా?"

"అవును. అవేకాక 'లోబ్ శాంగ్ రాంపా'వి కూడా చదివా, మేడమ్ బ్లవట్ స్కీ కూడా చదివా. అలాగే మీ దివ్య జ్ఞాన సమాజపు లిటరేచర్ కూడా."

"దివ్య జ్ఞాన సమాజం కేవలం మాది మీది కాదే? అనిబిసెంట్, లెడ్ బీటర్ వంటి మహానుభావులు మొదలుపెట్టింది. కొంతకాలం జిడ్డు కృష్ణమూర్తిగారు నిర్వహించింది."

"యా.! మీరూ బాగానే చదివినట్టువున్నారే" నవ్వాడు రాబ్.

"దేశాలు వేరైనా, జాతులు వేరైనా, మతాలు వేరైనా మానవులు ఒక్కటే, మనుషుల కుతూహలమూ ఒక్కటే" నవ్వాడు జయదేవ్.

"యీ మాట మాత్రం నిజం. దేవతలూ, దెయ్యాలూ, యుద్ధాలూ, ప్రేమ కథలూ, త్యాగాలు, గత జన్మలూ, భవిష్యత్తు గురించి తెలుసుకోవాలనే తపనా, ఇవన్నీ మానవ సహజమే" ఒప్పుకున్నాడు రాబ్. మొదటి రౌండ్ పూర్తయింది.

"వాంట్ టూ హేవ్ ఒన్ మోర్ లార్జ్?"

"యా.!"

జయదేవ్ బేరర్‌ని పిలిచి మరో రౌండ్ ఆఫ్ డ్రింక్స్ తెమ్మని చెప్పాడు. మళ్ళీ సంభాషణ కాస్త భౌతికం కాస్త వేదాంతం మిక్స్‌డ్‌గా జరిగింది. డిన్నర్ పూర్తయేసరికి 8.30 PM అయింది.

"టైమ్ టూ రెస్ట్ ఐ థింక్. ఐ వాంట్ టూ కేచ్ సమ్ స్లీప్" అలసటగా అన్నాడు రాబీ. అతడికి ఏడున్నరకల్లా పడుకునే అలవాటు. గత రెండు రోజులుగా సరైన నిద్రలేదు. సార్ట్ ఆఫ్ జట్‌లాగ్. నిన్నకూడా. ఆల్ మోస్ట్ నిద్రలేని రాత్రి.

"ఓకె. రాబ్. నేను రేపు ఎనిమిదిన్నరకి కలుస్తాను. రేపే మీరు తిరుపతి వెళ్తున్నారు. ఓ కారు ఎరేంజ్ చేస్తాను. ఓకె?"

"గుడ్‌నైట్ జయదేవ్"

"గుడ్‌నైట్"

జయదేవ్ కరచాలనం చేసి బయలుదేరాడు రాబర్ట్ రూమ్‌లోకి వెళ్తూ నంబర్‌ని చూసి, 'ఇట్స్ థర్టీన్! గుడ్ సెంటిమెంట్ జయిస్తుందో, సెంటిమెంటే ఓడిపోతుందో ఇవాళ రాత్రి మళ్ళీ చూస్తాను" అనుకుంటూ నైట్ డ్రెస్‌లోకి మారాడు. ఆటోమేటిగ్గా కళ్ళు మూతలు పడ్డాయి.

"మిస్టర్ రాబర్ట్" ఎవరి పిలుపుతోనో మెలుకువ వచ్చింది రాబర్ట్‌కి. కళ్ళు తెరిచాడు.

ఓ ఆజానుబాహుడైన 'వైట్' మంచం మీద తన కాళ్ళ దగ్గర కూర్చుని వున్నాడు.

"మీరు?" అడిగాననుకున్నాడు రాబర్ట్. నోరు విచ్చుకోలేదు. ఆ ఆజానుబాహుడి చెయ్యి రాబర్ట్ మోకాలి మీద ఆనించి ఉంది. కదులుదామని ప్రయత్నించాడు. కానీ కదలలేకపోయాడు. రాబర్ట్ మనసులో ఓ తెలియని భయం ప్రవేశించింది.

"నా పేరు విలియమ్స్" ఆ మనిషి నోరు తెరవలేదుగానీ సమాధానం మాత్రం రాబర్ట్ మనసుకు తెలిసింది.

"లోపలికి ఎలా వచ్చారూ?" ప్రశ్నించాననుకున్నాడు రాబర్ట్.

"నేను ఎక్కడికైనా ఎప్పుడైనా వెళ్ళగలను. ఎక్కడికైనా రాగలను. నథింగ్ కెన్ స్టాప్ మీ" జవాబు మనసుకి మాత్రమే అందింది. చెవులకి వినిపించలా.

"నా దగ్గరికెందుకు వచ్చారూ?"

"నిన్ను ఇండియాకి రప్పించింది నేనే"

"ఎందుకూ?"

చిన్నగా నవ్విన ఫీలింగ్. కోల్డ్ స్మైల్.

ఒళ్ళు జలదరించింది రాబర్ట్‌కి. జలదరించిందా? కదలటానికి ప్రయత్నించాడు. ఉహూ.. శరీరం కట్టెలా బిగుసుకునే ఉంది.

"నీతో నాకు పనుంది. నీకు తెలుసా? మనం జన్మజన్మలుగా కలుస్తూనే ఉన్నాం. యీ జన్మలో నీ పేరు రాబర్ట్. నా పేరు విలియమ్స్. కేవలం పేర్లు మాత్రమే మారలేదు. శరీరాలూ మారిపోతై. ఆత్మ మాత్రం మారదు."

"అంటే మీరు ఆత్మా?"

మళ్ళీ నవ్విన ఫీలింగ్. అదే కోల్డ్ స్మైల్.

"ఏదయితేనేం? అనుభవమైతేగానీ అర్థంకాదు"

"ఎందుకొచ్చారూ?"

"ఒక్కసారి నన్ను నువ్వు చూడాలని వొచ్చాను. వొస్తూనే ఉంటాను... గుడ్ బై" చటుక్కున మాయం అయ్యాడు విలియమ్స్.

చివ్వున లేచాడు రాబర్ట్. చిత్రంగా శరీరం వెంటనే స్పందించింది. అంటే? అతని చెయ్యి తన మోకాలి మీద వున్నంతసేపూ కదల్లా. అవయవాలు పని చెయ్యలా. అయితే జరిగిన సంభాషణా? కాక? మరో దారిలేదు.

చూట్టూ చూశాడు రాబీ. తలుపులు వేసినవి వేసినట్టుగానే ఉన్నై. అసలిదంతా నిజంగా జరిగిందా లేక భ్రమా?

భ్రమ అనుకోవడానికి వీల్లేదు. మోకాలి మీద అతని స్పర్శ తాలూకు అనుభవం ఇంకా తెలుస్తూనే ఉంది. కోల్డ్ టచ్.

అయితే అతను రావటం అసంభవం. మాయం అయిపోవటానికి ఇదేమైనా సినిమానా? కంప్యూటర్ గ్రాఫిక్కా?"

టైమ్ చూశాడు. పన్నెండు గంటల ఇరవై నిముషాలు.

గాడ్.! అతనితో సంభాషించేటప్పుడు గంటల శబ్దం ఎక్కడో వినిపించిన గుర్తు. అసలీ వాల్ క్లాక్ గంటలు కొడుతుందా?

రిసెప్షన్‌కి ఫోన్ చేసి కనుక్కుంటే?

మంచినీళ్ళు తాగాడు రాబ్.

నో.! ఇదంతా భ్రాంతి. సరైన నిద్రలేక, మగత నిద్రలో కన్న కల. యస్!. ఓన్లీ ఏ డ్రీమ్.

మళ్ళీ పడుకుని నిద్రకి ఉపక్రమించాడు రాబ్.

"అదీ నాకొచ్చిన కల" కాఫీ సిప్ చేస్తూ అన్నాడు రాబ్.

"కల కావొచ్చు. కాకపోవచ్చు.. అతను, అంటే ఆ విలియమ్స్ ఎలా ఉన్నాడు?" అడిగాడు జయ్.

"చాలా పొడుగ్గా బలంగా ఉన్నాడు. మీ ప్రాచీన రుషుల్లాగా మూరెడు తెల్లని గడ్డం వుంది. కానీ అతను శ్వేత జాతివాడే, చాలా చురుకైన కళ్ళు. ఫోటోల్లో 'క్రీస్తు'కి వేసే 'రోబ్' ఉంది. మెడలో ఏవో మాలలున్నై. బట్ ఓహ్.. కోల్డ్ స్మైల్ ఎన్ కోల్ట్ టచ్"

"జన్మల గురించి నిన్న మన డిస్కషన్‌లో వచ్చిందిగా. సబ్ కాన్షస్ స్టేట్‌లో అది కలగా రూపాంతరం చెందివుండొచ్చు. లేక, ఏమో... నిజమూ కావొచ్చు. కొందరు అలా తలపులతో నిమిత్తం లేకుండా లోపలికి ఎంటర్ కావడం గురించి విన్నాను." సాలోచనగా అన్నాడు జయ్.

"ఈజిట్? ఎవరూ?" ఉద్విగ్నంగా అన్నాడు రాబో.

"శ్రీ రమణ మహర్షి.. పరమాచార్య చంద్రశేఖరేంద్ర సరస్వతీ, శ్రీ సత్య సాయిబాబాలాంటి మహానుభావులూ అవతార పురుషులూ వారలా వచ్చారనడానికి ఖచ్చితమైన ఆధారాలున్నై."

"అయితే విలియమ్సే నన్ను రప్పించాడంటారా?" ఆశ్చర్యంగా అన్నాడు రా బో.

"ఐ డోంట్ నో. 'వస్తూనే ఉంటాను' అన్నారన్నావుగా. మరోసారి కలలో కొస్తే అది భ్రమకాదని అనుకోవచ్చు. అప్పటిదాకా యీ విషయాన్ని మర్చిపోదాం" నవ్వాడు జయ్.

"ఓకె.. ఓకె. తిరుపతిలో ఎన్నాళ్ళుండాలి?"

"అది రేపు నేను అక్కడికి వచ్చాక డిసైడ్ చేద్దాం. కార్ రెడీగా ఉంది. హోటల్ మయూరాలో సూట్ బుక్ చేశాను. రిసెప్షన్‌కి వెళ్ళగానే కీ మీకు ఇస్తారు. ఓ గైడ్‌ని కూడా అరేంజ్ చేశాను. అతని పేరు శ్రీనివాస్. హాయిగా ఇంగ్లీష్‌లోనే మాట్లాడతాడు గనక భాష సమస్య ఉండదు. ఏది కావాలన్నా అతను చూసుకుంటాడు"

ఇద్దరూ రూమ్ చెకౌట్ చేసి బయటికి వచ్చారు. కారు రెడీగా ఉంది. లోపలికి ఎక్కి, "బై జయ్.. సీ యూ టుమారో" అన్నాడు రాబ్.

"బై.!" టాటా చెప్తూ డ్రైవర్ వంక చూశాడు జయ్.

"స్టాపిట్" అరిచాడు జయ్. స్టార్ట్ అయి వెళ్ళబోతున్న కారు ఆగింది.

"నీ పేరేంటి?" తమిళ్‌లో అడిగాడు సుజయ్ డ్రైవరిని.

"ఏడుమలై" వినయంగా చెప్పాడు డ్రైవర్.

"ఓకె... ఓకె. సార్‌ని జాగ్రత్తగా తీసుకెళ్ళు" అయోమయంగా అన్నాడు జయ్. కార్ డ్రైవర్ అచ్చు రాబర్ట్ వివరించిన విలియమ్స్‌లా ఉన్నాడు. గడ్డంతో సహా. రంగు ఒక్కటే తేడా. విలియమ్స్ శ్వేత జాతివాడైతే, ఇతను నలుపు.

"ఓకే సార్. జాగ్రత్తగా తీసికెళ్తా." జయదేవ్ వంక సూటిగా చూసి నవ్వాడు డ్రైవర్. కోల్డ్‌లుక్.. కోల్డ్ స్మైల్. ఏదో చెప్పాలనుకున్నాడు జయ్. కానీ నోటమాట రాలేదు. మనసులో ఓ ఆలోచన మెరిసింది. అవును. రాబ్ కార్లోకి ఎక్కేటప్పుడు కూడా డ్రైవర్ ముఖం చూడలేదని.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments